www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్



## కో-ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌లో పనిచేస్తున్న కొందరి కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్‌పై చర్యలు తీసుకుని ఐజి డి సంస్థపై విచారణ చేసి రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐజిడి పేరుపై కార్మికుల్ని తీసుకుని విశాఖపట్నంలో ట్రైనింగ్ ఇచ్చి కడప మండలాలలో తిప్పుతూ పని చేయించుకుంటున్నారని తెలిపారు. అదే స్థాయిలో వేతనాలు అడిగిన వారిని ఇబ్బందులు గురిచేస్తూ, బెదిరిస్తూ, అగౌరవంగా మాట్లాడుతున్న డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో వారి అనుచరులు, బంధువుల పేర్లు పెట్టుకుని నడుపుతున్నారని తెలిపారు. వీటన్నిటిపై విచారించి ఐజిడిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ ఉన్న కార్మికులకు వేతనాలు ఇవ్వాలని తెలిపారు. లేకపోతే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. వీటిపై జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

# సర్వం సిద్ధం




**నేడు గ్రూప్-2 మెయిన్ పరీక్షలు**
**జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు**
**పరీక్షలు రాయనున్న 5825 మంది అభ్యర్థులు**



**ప్రజాశక్తి-కడప**

గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని 5825 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పార్ట్-1 సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పార్ట్-2 సెషన్ నిర్వహిస్తారు. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

### పరీక్ష కేంద్రాలు ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కడప నగరం, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశారు. కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 720 మంది, కడప ఆర్ట్స్ కళాలలో 283 మంది, కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 720 మంది, చింతకొమ్మదిన్నెలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో 504 మంది, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో 480 మంది, శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 450 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. కడప శ్రీహరి డిగ్రీ, జూనియర్ కళాశాలలో 480 మంది, ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాలలో 480 మంది, నారాయణ జూనియర్ కళాశాలలో 384 మంది, ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 360 మంది, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 312 మంది, శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో 312 మంది, కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 310 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

### పకడ్బందీగా ఏర్పాట్లు



ఎపిపిఎస్‌సి గ్రూప్-2 మెయిన్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లను అధికారుల సమన్వయంతో చేస్తున్నాం. అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు, 1.30 గంటల నుండి 2.45 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ఏడుగురు లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్ వైజర్లు నియమించాం. పరీక్షలు సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా ఉండేటట్లు చర్యలు తీసుకున్నాం. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు సంబంధించి హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశాం. హెల్ప్ డెస్క్ నంబర్ 08562-246344.

**- ఎం.విశ్వేశ్వర నాయుడు, డిఆర్ఒ కడప.**

# పరీక్షకు సెలవు ఇవ్వలేదని ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి - చాపాడు**

పరీక్షకు సెలవు ఇవ్వలేని ఎఎన్ఎం మనస్థాపానికి గురై గాజు ముక్కతో చెయ్యి కోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ సంఘటన మండలంలోని నక్కలదిన్నె పిహెచ్‌సి పరిధిలోని అయ్యవారిపల్లె సచివాయంలో చోటు చేసుకుంది. వివరాలు... అయ్యవారిపల్లె సచివాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సింధూకు ఈనెల 24న ఎస్‌వి ఓపెన్ యూనివర్శిటీ మూడవ సంవత్సరం పరీక్షలున్నాయి. ఈ సందర్భంగా తనకు సెలవు కావాలని రెండు రోజులుగా వైద్యాధికారి కావ్య మాధురిని ఆమె అడిగారు. ఎంఎల్‌హెచ్‌పి ఉష అనుమతిస్తే తీసుకోవచ్చని లేదంటే లేదని వైద్యాధికారి చెప్పారు. ఎమ్ఎల్‌హెచ్‌పి సెలవు అడిగితే తనకు ఎలాంటి సంబంధం లేదని, సెలవుపై వెళ్తే ఎవరు పనులుచేస్తారని హేళగా మాట్లాడారని బాధితురాలు వాపోయింది. 'నీకు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం ఉంది కదా..డిగ్రీలు అవసరమా.. పరీక్షలు ఎప్పుడైనా రాసుకోవచ్చు.. సెలవు ఇవ్వను' అని వైద్యాధికారి కావ్య మాధురి తేల్చి చెప్పారు. దీంతో మనస్థాపానికి గురైన ఎఎన్ఎం గాజులతో చెయ్యి కోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. సాయంత్రం 3.40 గంటలకే సిబ్బంది పిహెచ్‌సి మూత వేసి వెళ్ళిపోయారు. స్థానికులు గుర్తించి 108 సహాయంతో వైద్య చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. చాపాడు మండల పరిధిలో ఎఎన్ఎంలకు కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు సెలువలు ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేల పేరుతో సెలవులు ఇవ్వకుండా ఎంతటి అవసరమున్నా పనులు చేసుకోవాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. గత నెలలో ఈ ఎఎన్ఎం తన కుమారునికి ఆరోగ్యం సరిగా లేదని సెలువు అడిగినప్పటికీ ఇవ్వకపోవడంతో కడప డిఎంహెచ్ఒ దగ్గరికి వెళ్లి మంజూరు చేయించుకున్నారు. వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పిలతో ఇబ్బందులు పడుతున్నామని బాధితురాలు పేర్కొన్నారు.



చెయి కోసుకున్న బాధితురాలు




సచివాలయ ప్రాంగణంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న సింధూ

## 'సీమ' ప్రాజెక్టులను పూర్తి చేయాలి

**- ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలో ఎపి రైతు సంఘం నిపుణుల డిమాండ్**

**ప్రజాశక్తి- కడప అర్బన్**

రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలు కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారాయని ఈ ప్రాంత విముక్తి కోసం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు ప్రభుత్వం పూర్తి చేయాలని విపి రైతు సంఘం ప్రాజెక్టుల నిపుణులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభను కడప నగరంలోని హరితహోటల్‌లో నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిపుణులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టుల సమరశీల పోరాటానికి 1970, 80వ దశకంలోనే ఉ ద్యమాలను ప్రారంభించారని చెప్పారు. దశాబ్దాలుగా ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించి శంఖుస్థాపనలు చేశారే తప్ప పూర్తి చేయడానికి మాత్రం ఏ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాజెక్టులలోని నీటిని పంపిణీ చేయడానికి అనుసంధానంగా మారే చిన్న కాలువలను పూర్తి చేయడానికి బడ్జెట్లో రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశాడు. పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులు అనాది కాలంగా వివక్షకు గురవుతున్నాయని, ప్రాజెక్టులు పూర్తయితే సాగు, త్రాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల ఉద్యమకారుడు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు క్లిష్టమైందని ఉన్న ప్రాజెక్టులనే సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ప్రాజెక్టులు ఎన్టీరామారావు, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ముందడుగు వేశాయే తప్ప, ఏ ప్రభుత్వమూ ప్రాజెక్టుల సాధన కోసం బడ్జెట్లో నిధుల కేటాయింపుపై, విధులపై, ప్రాజెక్టుల అనుసంధానంపైన పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు రైతు సంఘం జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, రామచంద్రయ్య పెద్ద ఎత్తున రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి పలువురు నాయకులు తరలివచ్చారు.




మాట్లాడుతున్న నీటిపారుదల నిపుణులు లక్ష్మీనారాయణ

## రోస్టర్ పాయింట్లను సరిదిద్దాలి

**ప్రజాశక్తి - కడప :** రోస్టర్ పాయింట్లను సరిదిద్ది 'గ్రూప్ టు మెయిన్స్' పరీక్షను నిర్వహించాలని అభ్యర్థులు తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాయింట్లను సరిదిద్దాలని తాము ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకై తమ ఆశలను నీరుగార్చే విధంగా ఉన్నాయని వాపోయారు. నిరసనల ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

## చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

**ప్రజాశక్తి - కడప :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి క. ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కడప నగరం రామాంజనేయ పురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024: లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్స్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాలల, కౌమార లేబర్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో డిఇఒ షేక్ షంషుద్దీన్, కడప డిస్ట్రిక్ట్ జైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.ఆర్ సుభాష్ యాదవ్, వన్స్ స్టాప్ సెంటర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతా, కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సిహెచ్ జ్యోతి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** భారతీయ సంస్కృతి సాహిత్యాలలో ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రత్యేకించి కడప ఉర్దూ సాహితీ చరిత్ర ఘనమైందని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. యోగి వేమన యూనివర్సిటీ ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో 'కడపలో ఉర్దూ సాహిత్యం' అనే అంశంపై జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. రెండవ భాష ఉర్దూ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో యూపి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయన్నారు. ఉర్దూ భాష సారాంశంలో ప్రేమ, సోదర భావం, శాంతి సామరస్యం, జాతీయ సమైక్యత ఇమిడి ఉందన్నారు. మాజీ కులసచివులు ఆచార్య నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ కడప జిల్లా సాహిత్యం గురించి వివరించారు. చెన్నై ఉర్దూ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సజ్జాద్ హుస్సేన్ మాట్లాడుతూ జాతీయ సదస్సు ద్వారా ఉర్దూ సాహిత్యానికి ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎ.ఎం.ఫజులుల్లా మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న గొప్ప కవులు, రచయితల గురించి తెలుసుకోవాలన్నారు. కర్నూల్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ సత్తార్ సాహిర్ మాట్లాడుతూ కర్నూలు కడప గుంటూరులోని యూనివర్సిటీ ఉర్దూ సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రచయితలు విమర్శకులు, మత గురువులు, స్థానిక ఉర్దూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్థిక పరిపుష్టితోనే జిల్లా అభివృద్ధి

**- కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.జి.జయశ్రీ**

**ప్రజాశక్తి - కడప**

ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టితో పాటు అన్ని ప్రమాణికాలలో వైఎస్ఆర్ జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయం అని కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం. జి. జయశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన ఆకాంక్షిత జిల్లాలో 'ఆర్థిక పరిపుష్టి – కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్' అనే అంశంపై బ్యాంకు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 'నీతీ ఆయోగ్' ద్వారా అత్యుత్తమ పురస్కారం బహుకరించడం అభినందనీయం అన్నారు. ఇప్పటి వరకు ఆకాంక్షిత జిల్లాల లక్ష్య సాధనలో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశించిన అన్ని రంగాల్లో పురోగమనంలో ముందుకు సాగడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. జెసి అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని, ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధనలో భాగంగా కీ పాయింట్ ఇండికేటర్స్ పై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జనార్దన్, నాబార్డ్ ఏజిఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్‌డిఒ నవీన్ కుమార్, కెనరా బ్యాంకు ఎజిఎం మురళి మోహన్, ఎస్‌బిఐ ఎజిఎం వాణి కిషోర్ కుమార్ రెడ్డి, యుబిఐ ఎజిఎం లక్ష్మీ తులసి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎం.జి.జయశ్రీ

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి : జెఇఒ

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**

శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు టిటిడి జెఇఒ వి. వీరబ్రహ్మం సూచించారు. ఒంటిమిట్టలో జరుగుతున్న ఏర్పాట్లపై తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సఆవలు ఏప్రిల్ 06 – 15 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో రాజీ లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఏప్రిల్ 11న నిర్వహించబోయే శ్రీ సీతారాముల కల్యాణానికి ముందస్తుగా అనుమతులు తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శ్రీసీతారాముల కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేయాలన్నారు. మరింతగా ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టాలన్నారు. త్వరలో కడప జిల్లా అధికారులతో టిటిడి ఇఒ శ్యామలరావుసమన్వయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. **బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు :** ఏప్రిల్ 6న ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం, 7న వేణుగాన అలంకారం, హంసవానం, 8న వటపత్రసాయి అలంకారం, సింహవాహనం, 9న నవనీత కృష్ణ అలంకారం, సింహవాహనం, 10న మోహినీ అలంకారం, గరుడసేవ, 11న శివనసుర్భాణ అలంకారం, శ్రీ సీతారాముల కల్యాణం, గజవాహనం, 12న రథోత్సవం, 13న కాళీయమర్ధన అలంకారం, అశ్వవాహనం, 14న చక్రస్నానం, ధ్వజావరోహనం, 15న పుష్పయాగం ఉంటుంది. సమావేశంలో సిఇ సత్యనారాయణ, ఎస్ఇ వేంకటేశ్వర్లు, ఒంటిమిట్ట ప్రత్యేక అధికారి ప్రశాంతి, డిప్యూటీ ఇఒ గోవింద రాజన్, అన్నప్రసాద ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - కడప :** కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ శిక్షణ కార్యక్రమాల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకులకు ఈనెల 25 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అని ఆ సంస్థ డైరెక్టర్ ఆరిఫ్ తెలిపారు. 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులుపై తెలిపిన శిక్షణ కార్యక్రమాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440905478, 9985606866, 9440933028 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

## విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు

**ప్రజాశక్తి - వల్లూరు :** రాష్ట్రీయ కిషోర్ బాలికల సంరక్షణ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల నిర్వహించారు. ఈ సందర్భంగా బాలిక సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి సరైన సలహాలు సూచనలు అందజేయాలని వివరించారు. విద్యార్థుల్లో రక్తహీనత పరీక్షలు పళ్లు, కళ్లు, చెవి పరీక్షలు కూడా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫణీంద్ర, సిహెచ్ఒ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు విజయభారతి, రత్నాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అవగాహన తప్పనిసరి

**ప్రజాశక్తి - వల్లూరు :** సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని హెడ్స్ సంస్థ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పుష్పగిరి గ్రామంలో కెఎస్ రూలర్ మీడియా కళాబృందం వారిచే సైబర్ మోసాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అక్షరాస్యత డిజిటల్ లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువ అవుతున్నాయని అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెర్స్ కో– ఆర్డినేటర్ కె. ఉదయ్ కుమార్, కళాబృందం ఎం. శ్రీనివాస్, ఎం. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## నేడు ఇంటర్ పరీక్షలపై సమావేశం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఇంటర్ పరీక్షలపై ఆదివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల నిర్వహణ నిమిత్తం పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్ల, అడిషనల్ చీఫ్ సూపరిండెంట్లు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

## 'ఆకేపాటి'కి కృతజ్ఞతలు

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట :** రాజంపేట నియోవర్గ యూత్ అధ్యక్షులు కె. ఓబుల్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు డి. లక్ష్మినారాయణరెడ్డి, మాచుపల్లి సర్పంచ్ శివనారాయణ, పార్టీ నాయకులు మల్‌రెడ్డి శనివారం అన్నమయ్య వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీలో తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన అమర్‌నాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.



ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

## ఎస్టేట్ ఆక్రమణలపై ఉత్కంఠ!

**- ఆకేపాటి తరుపున విచారణకు న్యాయవాది హాజరు**
**- రాజంపేట వైసిపి శ్రేణుల్లో ఆందోళన**

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఎస్టేట్ ఆక్రమణలపై ఉత్కంఠ నెలకొంది. రాజంపేటకు చెందిన టిడిపి నాయ కుడు ఆకేపాటి ఎస్టేట్ ఆక్రమణలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి స్పందించి ఆకేపాటి ఆక్రమణలపై విచారణ చేపట్టాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనికి కలెక్టర్ స్పందించి ఎమ్మెల్యే ఆకేపాటి కుటుంబీకులను విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణకు శనివారం సాయంత్రం ఐదు గంటలలోపు ఎస్టేట్ భూముల రికార్డులను అందజేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తన తరుపున ఒక న్యాయవాదిని రికార్డులతో సహా విచారణకు హాజరుపరిచారు. శనివారం నాటి విచారణలో ఆకేపాడు, మందపల్లి, శేషమాంబపురం పంచాయతీ పరిధిలోని భూముల రికార్డులను న్యాయవాది అందజేశారు. అంతకుముందు రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో సేకరించిన రెవెన్యూ రికార్డులతో ఆకేపాటి ఎస్టేట్ రికార్డులు సరిపోలతాయా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. రెవెన్యూ అధికారుల సర్వే రికార్డులతో ఆకేపాటి న్యాయవాది అందజేసిన రికార్డులు సరిపోలని పక్షంలో ఏమి జరుగుతుందనే ఉత్కంఠ రేపుతోంది. ఇటీవల రాజంపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చిన తరహాలో ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆక్రమణలను కూల్చుతారా అనే ఆందోళన నెలకొంది.

## నేడు నెలనెలా సీమ సాహిత్యం

**ప్రజాశక్తి -కడప అర్బన్ :** యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 141వ సదస్సును ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో 'ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలా సాహిత్యం' అనే అంశంపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధక విద్యార్థి జి.రమేష్ బాబు ప్రసంగిస్తారని తెలిపారు.

## సైన్స్ ఫెయిర్ ఉపయోగకరం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** నగరంలోని రవీంద్ర నగర్‌లో ఉన్న అస్సాలిహాత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా సైన్స్ ఆఫీసర్ ఇమ్మానుయేల్, కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్, శ్రీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సి.ఓబుల రెడ్డి, డిపిసి కన్వీనర్ బాబు భాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు మేధో శక్తి పెంచుకోవడానికి సైన్స్ ఫెయిర్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. అబ్బుర పరిచే విధంగా సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రతిభతో విద్యార్థులు తయారు చేసి వాటి గురించి వివరించడం ప్రశంసనీయమన్నారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో పలు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొని తిలకించి ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులను అభినందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా, స్కూల్ హెడ్ మాస్టర్ మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిగ్గుతేలేనా!

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలోని భూ ఆక్రమణలపై సర్వే శకం నడుస్తోంది. కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వ హయాంలో కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకున్న భూ ఆక్రమణల్ని నిగ్గు తేల్చడంపై సీరియస్‌గా దృష్టి సారించింది. రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడిన వెంటనే ప్రత్యర్థుల ఆక్రమాలపై దృష్టి సారించింది. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి ఫైల్స్ ఘటన, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్, అనంతరం కడప జిల్లాలో వైసిపి కీలక నాయకుడు సజ్జల ఎస్టేట్ పేర్లతో పాల్పడిన భూఆక్రమణలపై సర్వే చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ వైఖరిని పరిశీలిస్తే ప్రత్యర్థి పార్టీకి చెందిన ఆక్రమార్కులే లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోంది. 2014-2019 పీరియడ్‌లో చుక్కల భూములను స్వాహా చేసిన ఆక్రమార్కులను భరతం పడితేనే విశ్వసనీయత పెరుగుతుందని చెప్ప వచ్చు. ప్రత్యర్థులను వెంటాడడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని గ్రహించాలి. సర్వే, విచారణ ద్వారా వాస్తవ ఆక్రమణల్ని వెలికితీయడం, అక్రమార్కులపై కేసులు నమోదు చేయడం వరకు బాగానే ఉంటుంది. ఆక్రమార్కులు కోర్టును ఆశ్రయించడం ద్వారా ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న ఎదురవుతోంది. రెవెన్యూ కేసులు కోర్టుల్లో తేలేసరికి పాలకులు మారిపోయే రోజుల్లో ఉన్నామనే వాస్తవాన్ని గ్రహించాలి. భూముల ఆక్రమణల్ని స్వాధీనం చేసుకోవడానికి గల అవకాశాలను అన్వేషించాలి. లేనిపక్షంలో భూ ఆక్రమణలకు తెరపడడం ఎప్పటికీ సాధ్యం కాదనే సంగతిని గ్రహించాలి. 2014-19 పీరియడ్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే కుటుంబాల ఆక్రమణల పర్వంపై పత్రికల్లో పతాకశీర్షికలను ఆక్రమించిన సంగతి తెలిసిందే. ఆక్రమణదారుల చెరలోని భూములకు సంబంధించిన కచ్చితమైన ఆధారాలతో ముందుకు కదలాలి. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకునేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ఫైల్స్ ఘటన మరకముందే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్ భూ ఆక్రమణలపై విచారణ ముగిసేలోపు తాజాగా వైసిపి కీలక నాయకులు సజ్జల ఎస్టేట్‌లోని భూ ఆక్రమణలపై సర్వే చేపట్టడం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. భూ ఆక్రమణలపై కుటుంబ సభ్యుల పేరిట భూములు పెట్టడం, దానవిక్రయాది వంటి లొసుగులను, కపట నాటకాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి, సజ్జల ఎస్టేట్‌లోని ప్రభుత్వ, డికెటి, ఫారెస్ట్ భూముల వాస్తవాల వివరాలను నిగ్గుతేల్చాలి. ఆక్రమణదారులపై పకడ్బందీగా కేసులు నమోదు చేసి ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**



నినాదాలు చేస్తున్న పశువైద్య విద్యార్థులు

## కొనసాగుతున్న పశువైద్యుల దీక్షలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

తమకు స్టయిఫండ్ రూ.7వేల నుంచి రూ.25వేల వరకు పెంచాలని పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక దీక్షలో శనివారానికి 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పశువైద్య విద్యార్థులు గౌరవ వేతనం పెంచాలని దీక్ష చేపడుతున్నా, ఉన్నతాధికారులు.. రాజకీయ నాయకులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య వృత్తి చేస్తున్న వారిని సమానంగా చూడాలన్నారు.

## 19వ విడత పిఎం కిసాన్ నిధులు రేపు జమ

**ప్రజాశక్తి - ముద్దనూరు**

19వ విడత పిఎం కిసాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు ఎఒ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 5,988 మంది రైతులకు రూ.1కోటి 19 లక్షల 76 వేల రైతుల ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిపారు. డిబిటి పద్ధతిలో సోమవారం ప్రధానమంత్రి చేతుల మీదుగా పిఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. పిఎం కిసాన్ పొందే రైతులు తప్పకుండా రైతు రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా పొందేందుకు రైతు రిజిస్ట్రీ ద్వారా పొందే విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడి) ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డ్ లింక్ చేసుకోవాలని ఎఒ కోరారు.

## ఘనంగా శ్రీవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

సింహాద్రిపురంలోని శ్రీవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలంలోని మూలపాకు సమీపంలో ఉన్న పునీత లారెన్స్ వృద్ధాశ్రమంలో శనివారం మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన డిఎల్ యువసేన సభ్యుడు కోటయ్యగారి గురు మోహన్, ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి, సుభద్రమ్మ 52వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని నిరాశ్రయులకు, బాటసారులకు అల్పాహారం, తాగునీరు నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని లక్ష్మీపేట జడ్‌పి హైస్కూల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు పరీక్ష సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఒ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు గతంలో కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ఆదరించడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గ్రామ ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతో ఉన్నతంగా ఎదగవచ్చు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

చదువుతో ఉన్నతంగా ఎదగవచ్చని, ఇష్టపడి చదవాలని, విద్యార్థి దశ మళ్లీ రానిదని గౌతం ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు కె.కె. నారాయణస్వామి ధర్మపత్ని మునిలక్ష్మమ్మ పేర్కొన్నారు. నారాయణ స్వామి జ్ఞాపకార్థం శనివారం వైఎమ్ఆర్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నారని, అందుకు చదువే కారణమన్నారు. ముఖ్యఅతిథిగా సిఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ యుతమైన జీవితం గడపాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రాణదాత సేవాసమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సమితి చైర్మన్ సునీల్, సభ్యులు న్యాయవాది సుమంత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**ప్రజాశక్తి - చక్రాయపేట**

మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగులగుట్టపల్లెలో తన నివాసం వద్ద శనివారం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పలు సమస్యలను తన దృష్టికి తెచ్చారని తెలిపారు. మండలంలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రజల సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించారు. తగు న్యాయం చేస్తామని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివారెడ్డి, ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఎద్దుల చంద్ర, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి

# రోడ్డు నిర్మాణ పనులతో తప్పని తిప్పలు




ఎలాంటి జాగ్రత్తలు లేకుండా లారీలో తరలిస్తున్న బూడిద

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని ఏటూరు కాలువ వద్ద నెల్లూరు-బళ్లారి రోడ్డు నిర్మాణంలో భాగంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా అధికంగా బూడిద, గ్రావెల్ వినియోగిస్తున్నారు. బూడిద తరలిస్తున్న లారీలకు ఎలాంటి పట్టలు కట్టకపోవడంతో బూడిద ఎగసిపడుతోంది. ఇవి ఇతర ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. వాహనదాలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రొద్దుటూరు-మైదుకూరు మార్గాన నిత్యం అధికంగా లారీలు వెళుతుంటాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, రైతులు ఉపయోగించే ట్రాక్టర్లు, బస్సులు పెద్ద లారీలతో రద్దీగా ఉంటుంది. దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామ,ఇ అనారోగ్య పాలవుతున్నామని పలువురు ఆందోళన చెంఉదుతున్నారు. రోడ్డు నిర్మాణదారులు ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కూడా నీరు పట్టకపోవడంతో ప్రతినిత్యం దుమ్ము లేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా బూడిదతో వస్తున్న లారీలపై పట్టలు ఏర్పాటు చేయడం, నీటిని చల్లడం వంటి జాగ్రత్తలు పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# 25న ప్రజ్ఞా వికాస్ పరీక్షలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న కడప జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రజ్ఞా వికాస్ పరీక్షలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో జరగబోయే ప్రజ్ఞా వికాస్ పరీక్షను విజయవంతం చేయాలన్నారు. ఆ మేరకు ప్రజ్ఞ వికాస్ కరపత్రం ఎంఇఒ సావిత్రమ్మ విడుదల చేశారు. ప్రముఖ విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావు ప్రస్తుత ఎమ్మెల్సీ పర్యవేక్షణలో ఈ ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థులో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దురాహుల్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 25న కూడా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కడప జిల్లాలో మోడల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజ్ఞా వికాస్ మోడల్ పరీక్షలో పాల్గొనేవారు తమ స్కూల్, వ్యక్తిగత వివరాలు రాహుల్ 82977 62173, డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు కార్యదర్శి విశ్వనాథ్ 80080 87023 సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయంత్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మేరి కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎంఇఒ, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

# తడి, పొడి చెత్త ద్వారా సంపద తయారీ : డిపిఒ




'ఇంటింటా చెత్త సేకరణ'లో అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా చేపట్టాలని, చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఖాజీపేట మేజర్ పంచాయితీ, మండల పరిధిలోని ముత్తులూరుపాడులో శనివారం ప్రత్యేకంగా చేపట్టిన ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ, చెత్త నుంచి సంపాదనను సృష్టించే విధానాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. ప్రతిరోజు ఇంటింటా నుంచి చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా జరగాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాణెమ్మ, భూమయ్యపల్లె సర్పంచ్ కొంగాని వెంక టసుబ్బయ్య యాదవ్, రిసోర్స్ పర్సన్ దేవేందర్‌రెడ్డి, పంచాయితీ కార్య దర్శులు రమణారెడ్డి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

**సింహాద్రిపురం :** గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ అంబాసిడర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి సూచించారు. సింహాద్రిపురంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేసిన ప్లాస్టిక్ డబ్బాలు వినియోగిస్తూ తడిపొడి చెత్తను వేరు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ వచ్చినప్పుడు తప్పనిసరిగా చెత్తను వారికి అందజేయాలన్నారు. చెత్తను రోడ్డు మీద వేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

**చాపాడు :** మండల పరిధిలోని మడూరు గ్రామ పంచాయితీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి మాట్లాడుతూ పొడి చెత్తను సంచిలో, తడి చెత్తను ప్లాస్టిక్ బుట్టలో ఉంచాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు చెత్తను అందజేసి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సుధాకర్, గ్రీన్ అంబాసిడర్స్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# రాయితీతో బిందు సేద్యం పరికరాలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తుందని ఎపిఎంఐపి పథక సంచాలకులు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో శనివారం ఉద్యాన శాఖ డివిజన్ పరిధిలోని మండలాల ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు బిందుసేద్య పరికరాల అమరిక, అభివృద్ధిపై వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలతోపాటు మొక్కజొన్న, సజ్జ, పత్తి వంటి వ్యవసాయ పంటలకు కూడా బిందు సేద్యం పరికరాలను అమర్చుకునేలా రైతులను అవగాహన కల్పించి సిద్ధం చేయాలని సూచించారు. ఐదు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90శాతం, ఐదు ఎకరాల పైబడి పొలం కలిగిన ఇతర రైతులకు 70 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పరికరాలు అందించుటలో పరిమితి లేదన్నారు. స్ప్రింక్లర్లకు చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీతో ఇవ్వనున్నట్లు చెప్పారు. డ్రిప్ సరఫరా చేసేందుకు 30 కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. పరికరాలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించిన పొలాన్ని రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జి, కంపెనీ ప్రతినిధులు కలిసి సందర్శించనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రాథమిక సర్వే చేసి పంటలు ఆధారంగా అంచానా వేసి రైతుకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో ఉద్యానధికారి మల్లేశ్వరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి యేసునాథరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



బిందు సేద్యం అమరిక పరికరాలను పరిశీలిస్తున్న వేంకటేశ్వరరెడ్డి

# సమాజ సేవకుడు అబుల్ కలాం అజాద్

**- కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అప్జల్ ఖాన్**

**ప్రజాశక్తి - కడప**

సమాజ సేవకు అంకితభావంతో సేవలు అందించిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షులు అప్జల్ ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి జకరయ్య అన్నారు. భారతదేశంలో విద్యా పునాదిని స్థాపించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 68వ వర్ధంతి సందర్భంగా శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆజాద్ స్వదేశీ (స్వరాజ్యం) ఉత్పత్తులను ప్రోత్సహించడం వంటి గాంధీ ఆదర్శాలకు తనను తాను అంకితం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్తార్, సిరాజుద్దీన్ విజయ భాస్కర్, నగర డివిజన్ ఇన్‌ఛార్జులు హమీద్ ఆబిద్, కమాల్, అసిఫ్ ఖాన్,ప్రసాద్,మహిళా నాయకులు సంధ్య పాల్గొన్నారు.

**కడప అర్బన్ :** భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేటి యువతకు ఆదర్శమని, యువత అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో ప్రయాణించాలని నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ఉర్దూ మెయిన్ పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు కరి ముల్లా ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఖాజీపేట :** భారత స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై స్వాతంత్రం కోసం సేవలందించిన అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ ఎస్సి జిల్లా చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు షేక్ హాజీగౌస్, షేక్ ఇస్మాయిల్, చరిత్రకారులు షేక్ ఇంతియాజుద్దీన్ కొనియాడారు. స్థానిక బస్టాండ్ కూడలిలో శనివారం అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

### మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి

**వేముల :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి చల్లా గంగాదేవి అధ్యక్షతన ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్‌పిటిసి కొకటం వెంకట బయపురెడ్డి అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. పిఆర్ ఎఇ అబ్దుల్లా మాట్లాడుతూ పలు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. జడ్‌పిటిసి నిధులు దాదాపు రూ.20 లక్షలతో వేముల, దుర్గన్నగారిపల్లి ఇతర గ్రామాల్లో ప్రహరీలు, తాగునీరు పనులు చేపట్టామన్నారు. ఇన్‌ఛార్జి ఎపిఒ మధు మాట్లాడారు. వేముల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్‌ను తన సొంత నిధులతో అందిస్తానని జడ్‌పిటిసి పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఇందిరారాణి, మండల ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, లీలావతి, ఎంపిటిసిలు బాబ్జాన్, లక్ష్మీదేవి, కో-ఆప్షన్ సభ్యులు మండి మా పీర, మండల అధికారులు చెన్నారెడ్డి, అబ్దుల్లా, రమేష్ రెడ్డి, శశికళ, అఫ్రిన్, పద్మావతి, సర్పంచులు చెన్నారెడ్డి, నిర్మల, అర్జున్, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**వేంపల్లె :** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్కే వ్యాలీ సిఐ ఉలసయ్య సూచించారు. ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటిలోని క్యాంపస్‌లో శనివారం యాంటి డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా సిఐ ఉల సయ్య, కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ లక్ష్మీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఉప యోగించడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. శరీరంలో కలిగే దుష్ప్రభావం, మానసిక రుగ్మతలు, చట్టపరమైన చర్యల గురించి వివరిం చారు. పోలీసు కళా జాగృతి బృందం హెడ్ కానిస్టేబుల్ నరసరావు ఆధ్వ ర్యంలో డ్రగ్స్ వలన కలిగే దుష్ప్ర భావా లను నృత్య, నాటక, పాటల రూపం లో ప్రదర్శనలు చేశారు. ట్రిపుల్‌ఐటి పరి పాలన అధికారి రవి కుమార్, అకాడమిక్ డీన్ రమేష్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 8న జాతీయ లోక్‌అదాలత్

**జమ్మలమడుగు రూరల్ :** మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. స్థానిక కోర్టు కార్యాలయంలో శనివారం ఆమె న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న కానిస్టేబుళ్లు, డివిజన్ పరిధిలోని అన్ని రకాల కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేలా చూడాలన్నారు. ప్రమాద కేసులు ఏవైనా ఉంటే ముందుగా కోర్టుకు తెలపాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు పెండింగ్ కేసులకు స్వస్తి పలికేలా చూడాలన్నారు.



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

## తొలి స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ'

**ప్రజాశక్తి - వేంపల్లె**

దేశంలోనే తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857లో ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిందని, అంతకు పదేళ్ల ముందే 1847లోనే నరసింహారెడ్డి ఆంగ్లేయుల దుష్ట పాలనపై తిరుగుబాటు చేసి వీర మరణం పొందాడని చెప్పారు. 1847 ఫిబ్రవరి 22న కోయిలకుంట్ల వద్ద జుర్రేటి వాగు ఒడ్డున రెండు వేల మంది ప్రజల సమక్షంలో నరసింహారెడ్డిని ఆంగ్లేయులు ఉరి తీసి ఆయన తలను కొయిలకుంట్ల కోట గుమ్మానికి 30 ఏళ్లపాటు వేలాడదీసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, వినయ్, వేమా రాజా, బద్రి, వెంకటేష్, మహబూబ్ బాషా, రవి పాల్గొన్నారు.

**కడప అర్బన్ :** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రథమ స్వాతంత్ర్య యోధుడని, ఆయన తిరుగుబాటు జాతీయోద్యమానికి ఎంతో ప్రేరణ ఇచ్చిందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ 178వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీ, ఆధిపత్యాలను ఎదిరించిన సాహసి అని కొనియాడారు. పరాయి పాలనలో ఎన్నో బాధలు అనుభవించిన రైతులు, బంట్రోతులు, గిరిజనులు ఆయన తిరుగుబాటులో పాలుపంచుకున్నారన్నారు. తిరుగుబాటును కర్కశంగా అణిచివేసిన బ్రిటీషర్లు నరసింహారెడ్డి కోయిల కుంట్లలో బహిరంగంగా ఉరి తీసి ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు 30 ఏళ్లు ఆయన తలను అలాగే ఉంచారన్నారు. కార్యక్రమంలో నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి,చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఏపీ నీటి సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, హిమబిందు, రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, నంద్యాలకు చెందిన సీనియర్‌పాత్రికేయులు జనార్దన్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్వాతంత్ర సమర యోధులు, తెలుగు తొలి విప్లవకారుడు, రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారిని ఎదిరించి వారికి ముచ్చెమటలు పట్టించిన గొప్ప వ్యక్తి అని రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఉన్న నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి కార్యదర్శి కోట ఓబులరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆసం దస్తగిరిరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పొలిమేర అమరనాథరెడ్డి, అమ్మిరెడ్డి రమణారెడ్డి(చిన్నా), నారుపల్లె లక్ష్మీనారాయణరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు :** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం భావితరాలకు ఆదర్శనీయమని రేనాటి సూర్యచంద్రుల సేవాసంఘం అధ్యక్షులు డాక్టర్ వై.వి.స్వరూప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు మారుతిప్రసాద్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**జమ్మలమడుగు రూరల్ :** బ్రిటిష్ వారిని మొదటగా ఎదిరించి ప్రథమ స్వాతంత్ర సంగ్రామ యోధుడుగా చరిత్రకెక్కిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, సురేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

## 24న రైతుల సమావేశాన్ని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఈనెల 24న మల్లేపల్లిలో చేపట్టిన రైతుల సమావేశాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివ కుమార్ పిలుపునిచ్చారు. ఆమేరకు వారు శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా భూముల్లో రోడ్లు వేయడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ కార్యాలయంలో రైతుల భూములకు సంబంధించి సాంకేతిక లోపంతో సమస్యలు ఉండడంతో వాటిని పరిష్కరించి రైతుల భూములు పోతున్న వారికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారందరికీ నష్ట పరిహారం ఇప్పించే బాధ్యత మాది అన్నారని, వారు ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రైతులకు నష్టపరిహారం ఇప్పించలేని పక్షంలో రైతులను కలుపుకొని దశలవారీ ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. మల్లెపల్లిలో జరగబోయే సమావేశాన్ని రైతులు, గ్రామస్తులు, మేధావులు జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, మండల కమిటీ సభ్యులు గోవింద్, అజయ్, ప్రసాద్, కార్యకర్తలు ఆంజనేయులు, చిన్నప్ప, వీరనారాయణ, బిగ్‌బాస్, సోమిరెడ్డిపల్లి అరవింద్ పాల్గొన్నారు.

## అక్రమాలకు కేరాఫ్ చేనేత క్లస్టర్లు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

జమ్మల మడుగు పరిధిలోని చేనేత క్లస్టర్ యాజమాన్యం, జౌళి శాఖ అధి కారులు సంయుక్తంగా ప్రజా ధనాన్ని మింగేస్తున్నారని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షులు జి.ఏసుదాసు ఆరోపించారు. స్థానిక క్లస్టర్ పాయింట్ వద్ద శనివారం వారు మాట్లాడుతూ చేనేత రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా యువతకు ఆ రంగం మీద శిక్షణ ఇచ్చి వారికి జీవన ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2016 చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేసిందన్నారు. క్లస్టర్లు చేనేత సొసైటీస్‌కి అనుబంధంగా పని చేస్తాయన్నారు. జమ్మలమడుగు పరిధిలో చేనేత క్లస్టర్ అధికారులతో కుమ్మక్కై ఈ పథకాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

## నిత్యాన్నదానానికి విరాళం

**చక్రాయపేట :** గండి క్షేత్ర నిత్య అన్నదానానికి శనివారం ప్రొద్దుటూరుకు చెందిన మలిశెట్టి కొండన్న ధర్మపత్ని ఎం.రామసుబ్బమ్మ గారి జ్ఞాపకార్థం రూ.50,116 విరాళం అందజేశారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి జె.వెంకట సుబ్బయ్య, ప్రధాన అర్చకులు వర్తి కేసరిస్వామి, ఉపప్రధాన అర్చకులు వర్తి రాజాస్వామి, మాజీ చైర్మన్ కె.వెంకటస్వామి, ప్రత్యేక ఆహ్వానితులు కొండారెడ్డి పాల్గొన్నారు.